క్లుప్తంగా

సీఐగా రాజేందర్‌రెడ్డి



మరికల్‌: సీఐగా రాజేందర్‌ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ రాజేందర్‌నాయక్‌ హైదరాబాద్‌ ఐజీపీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. వికారాబాద్‌ జిల్లా తాండూర్‌ సీఐగా విధులు నిర్వర్తించి, బదిలీపై ఐజీ కార్యాలయం వెయిటింగ్‌ నుంచి మరికల్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్‌ పరిధిలోని నర్వ, మరికల్‌, ధన్వాడ మండల్లాలో శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు.

విద్యార్థులకు స్నాక్స్‌ ఏర్పాటు చేయాలి

ధన్వాడ: పదో తరగతి విద్యార్థులకు ఉదయం అల్పాహారం సాయంత్రం స్నాక్స్‌ అందజేయాలని స్వేరో సర్కిల్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం తప్పనిసరిగా బ్రేక్‌ఫాస్ట్‌ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రత్యేక తరగతుల కారణంగా సాయంత్రం 5:30 గంటల వరకు విద్యార్థులు వేచి ఉండాల్సి వస్తుందని స్నాక్స్‌ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రభుత్వం స్పందించి ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



మరికల్‌: మండలంలోని పెద్దచింతకుంట ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం శివ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాలధారణ ధరించిన భక్తులు ప్రతినిత్యం స్వామివారిని దర్శించుకోనున్నట్లు గురుస్వాములు తెలిపారు. శివస్వాములు అధిక సంఖ్యలో పూజలో పాల్గొనాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊరలక్ష్మమ్మ ఉత్సవాలు

ఊట్కూరు: మండలంలోని మంగళవారం భక్తి శ్రద్ధలతో ఊర లక్ష్మమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో పుర వీధుల గుండా మహిళలు బోనాలను తలపై పెట్టుకుని మేలతాళాలతో నృత్యాలు చేస్తూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఎంపీటీసీ హన్మంతు, ఎం భాస్కర్‌, అరవింద్‌కుమార్‌, సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎం. విజయ్‌కుమార్‌, ఎల్కోటి నారాయణరెడ్డి, కుర్వ ఆశప్ప, జనార్దన్‌రెడ్డి, కొండన్‌ గోపాల్‌, వడ్ల మోనప్ప, రాములు పాల్గొన్నారు.

గజాలమ్మకు బోనాలు



మద్దూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో మంగళవారం గ్రామ దేవత గజాలమ్మకు బోనాలెత్తారు. గ్రామంలోని మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరంగా బోనమెత్తడంతో పండగ వాతావరణం నెలకొంది.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ


ధన్వాడ: మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు బుధవారం బదిలీ అయ్యారు. మండలంలో 20గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను ఒకే సారి బదిలీ చేశారు. కార్యదర్శులతోపాటు ఎంపీడీఓ విజయలక్ష్మి సిద్దిపేటకు బదిలీపై వెళ్లారు.

ఎంపీడీఓగా సాయిప్రకాష్‌

ఎంపీడీఓగా సాయి ప్రకాష్‌ను ప్రభుత్వం కేటాయించింది. ధన్వాడలో పనిచేస్తున్న విజయలక్ష్మిని సిద్దిపేట జిల్లాకు బదిలీ చేయగా గద్వాల జిల్లాలో పనిచేస్తున్న సాయిప్రకాష్‌ను ధన్వాడకు పంచాయతీరాజ్‌శాఖ కేటాయించారు. నేడు బాధ్యతలు చేపట్టనున్నట్లు సూపరింటెండెంట్‌ శ్రీనివాసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

దామరగిద్ద: రాష్ట్రస్థాయి సబ్‌ జూనియర్‌ కబడ్డీ పోటీలకు మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్‌ఎం ఈ.విశ్వనాథ్‌ తెలిపారు. ఈ మేరకు.. ఉపాధ్యాయులు ఎస్‌. విశ్వనాథ్‌, పీఈటీ వెంకటప్ప సమక్షంలో క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు నాగేశ్వరి,అనూష, మోహన్‌లను అభినందించారు. ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లాలోని చింతల పాలెంలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాల బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు పీఈటీ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునిత, రాములు, సంతోష్‌కుమార్‌, కాశప్ప, బాల్‌రాజ్‌, గోదావరి, కవిత, గౌతమి పాల్గొన్నారు.



డబుల్‌ ఓట్లు తొలగించండి

• కలెక్టర్‌ కోయ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ కోయ శ్రీహర్ష

నారాయణపేట: గ్రామాలు, పట్టణాల్లో డబుల్‌ ఓటర్లను గుర్తించి, జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా, ఇసుక సరఫరా, ప్రభుత్వ భూముల పరిరక్షణ తదితర అంశాలపై తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో డబుల్‌ ఓటర్లు, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. చిట్యాల, కొత్తపల్లి, మాగనూర్‌, దాసరిదొడ్డి ఇసుక రీచ్‌ల నుంచి ప్రజల అవసరాల మేరకు ఇసుకను సరఫరా చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్ల పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ భూములను గుర్తించి, నివేదికలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూముల్లో బోర్డు ఏర్పాటు చేయాలని, ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మయాంక్‌ మిట్టల్‌, అశోక్‌కుమార్‌ తదితరులు ఉన్నారు.

మద్దూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలవరీ చేయించుకునేలా గర్భిణులను ప్రోత్సహించాలని కలెక్టర్‌ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం మద్దూరు సీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని 11 సబ్‌సెంటర్లలో ఏఎన్‌ఎంల పనితీరుపై ఆరా తీశారు. 102 వాహనం, గ్రామాల వారీగా గర్భిణుల వివరాలతో పాటు హైరిస్క్‌ కేసుల విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను వైద్యాధికారి శ్రీలతను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎక్కువ మంది గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకోవడంపై కలెక్టర్‌ ఆగ్రహం వ్యక్తంచేశారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించడం లేదని.. సక్రమంగా పనిచేయడం లేదని ఫిర్యాదులు వచ్చాయని గుర్తుచేశారు. ఇకపై సిబ్బంది పనితీరుపై సూపర్‌వైజర్లు పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. గర్భిణుల నమోదుతో పాటు కాన్పు జరిగే వరకు ప్రభుత్వ పరంగా అందించిన వైద్యసేవల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఇమ్యూనైజేషన్‌ వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. దమగ్నాపూర్‌, రెనివట్ల గ్రామాల గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రుల్లో డెలవరీ చేయించుకోవడానికి గల కారణాలను తెలుసుకుని నివేదిక ఇవ్వాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు.

డ్రైవింగ్‌ సమయంలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంటీఓ ఆర్‌ఎస్‌ఐ శివశంకర్‌



అవార్డులు అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులతో ఎంవీఐ మేఘాగాంధీ

నారాయణపేట: డ్రైవింగ్‌ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండి సైన్‌ బోర్డ్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంటీఓ ఆర్‌ఎస్‌ఐ శివశంకర్‌ పోలీస్‌మోటార్‌ వాహన డ్రైవర్లకు సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ట్రైనింగ్‌సెంటర్‌లో జిల్లాలోని పోలీస్‌మోటార్‌ వాహన డ్రైవర్లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా పోలీస్‌స్టేషన్లలో పెట్రోలింగ్‌ కార్‌ విధులు నిర్వర్తించే వాహన డ్రైవర్లు నిరంతరం పెట్రోలింగ్‌ నిర్వహిస్తూ ఉండాలన్నారు. వాహనానికి జీపీఎస్‌ కనెక్ట్‌ చేశారని రాత్రి పెట్రోలింగ్‌ చేసే సమయంలో తమకు కేటాయించిన పోలీస్‌స్టేషన్‌ పరిధిలో నిర్విరామంగా పెట్రోలింగ్‌ నిర్వహిస్తూ, నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ముందస్తు నేరాలు జరగకుండా చూడాలని సైరన్‌ వేసుకుంటూ పెట్రోలింగ్‌ నిర్వహించాలన్నారు. వాహనాన్ని నడిపించే సమయంలో ప్రతి ఒక్కరూ నీట్‌ టర్నవుట్‌ యూనిఫామ్‌ కలిగి ఉండాలని, మద్యం సేవించి సేవించి వాహనాన్ని నడపొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లాలోని పోలీసు మోటారు వాహన డ్రైవర్లు, పోలీస్‌ కంట్రోల్‌ రూం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో ఏకాగ్రత కోల్పోవద్దు

వాహన డ్రైవింగ్‌లో ఏకాగ్రత కోల్పోవద్దని ఎంవీఐ మేఘాగాంధీ డ్రైవర్లకు సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం డీఎం లక్ష్మీసుధ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రత సూత్రాలను పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయొద్దన్నారు. 29 ఏళ్లుగా ఎలాంటి యాక్సిడెంట్‌లు కాకుండా సర్వీస్‌ చేసిన డ్రైవర్‌ బలనాగయ్యను సన్మానించారు. ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై చైతన్యం చేయాలి



ధన్వాడలో పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్‌ గౌతమ్‌

నర్వ: ఆర్థిక నేరాల కట్టడి చేయడానికి సీసీ టీవీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్యపర్చాలని ఎస్పీ యోగేష్‌ గౌతమ్‌ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్‌ఐ కురుమయ్య పూలమొక్కను అందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో క్రైం రికార్డులను పరిశీలించారు. రోజు వారీగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసుల వివరాలను పరిశీలించి 5ఎస్‌ ఇంప్లిమెంటేషన్‌ చేయాలని సూచించారు. రహదారుల వెంట డ్రంక్‌ డ్రైవ్‌ టెస్టులు నిర్వహించి ప్రమాదాలను అరికట్టాలన్నారు. ప్రజల నుంచి తీసుకునే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఆయనతోపాటు మరికల్‌ సీఐ రాజేందర్‌, పోలీస్‌ సిబ్బంది ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

ధన్వాడ: పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ యోగేష్‌ గౌతమ్‌ అన్నారు. బుధవారం ధన్వాడ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో సమయపాలన, క్రమశిక్షణ పాటించాలని ఆదేశించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలియజేయాలన్నారు. ఎస్పీ వెంట సీఐలు ఎన్‌.రాజేందర్‌, కె.రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు కుర్మయ్య, రమేష్‌ ఉన్నారు.

దాసరి కొండప్పకు సన్మానం



దామరగిద్ద: పద్మశ్రీ అవార్డును దామరగిద్దకు చెందిన గ్రామీణ కళాకారుడు దాసరి కొండప్పకు దక్కడం గర్వకారణమని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి కన్యాకుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొండప్ప నివాసంలో ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వసతిగృహ అధికారులు విజయ్‌కుమార్‌, వెంకటేష్‌, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెసర క్వింటా రూ.8,095

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్‌ యార్డులో మంగళవారం పెసర క్వింటాకు రూ.8,095 ధర పలికింది. వేరుశనగ గరిష్టంగా రూ.6,521, కనిష్టంగా రూ.4,050, అలసందలు గరిష్టంగా రూ.7,629, కనిష్టంగా రూ.7,616 ధరలు వచ్చాయి. ఎర్ర కందులు గరిష్టంగా రూ.10,411, కనిష్టంగా రూ.9,479, తెల్ల కందులు గరిష్టంగా రూ.10,830, కనిష్టంగా రూ.10,564 ధరలు పలికాయి.

ఎస్‌ఐగా రాంలాల్‌

మద్దూరు: ఎస్‌ఐగా ఏ. రాంలాల్‌ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐ విధులు నిర్వహిస్తున్న సురేష్‌గౌడ్‌ మల్దకల్‌కు బదిలీ కాగా మహబూబ్‌నగర్‌ జిల్లాలో వీఆర్‌ నుంచి రాంలాల్‌ బదిలీపై వచ్చారు. పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షించడానికి కృషి చేస్తానన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టరీత్యా చర్యలుంటాయన్నారు.

పాఠశాలల వివరాలు అందజేయాలి



మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్‌ఘని

మద్దూరు: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులైన తాగునీరు, విద్యుత్‌, అదనపు గదులు అవసరం, పర్నీచర్‌ తదితర అంశాలపై సమగ్ర నివేదికను అందజేయాలని డీఈఓ అబ్దుల్‌ఘని హెచ్‌ఎంలకు ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్‌ కార్యాలయంలో మౌళిక వసతులపై విద్యాశాఖ సమీక్ష నిర్వహించారు. కొడంగల్‌ ఏరియా డెవలప్‌మెంట్‌ అథారటీ అధికారి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మీమీ పాఠశాలలో ఉన్న సమస్యలపై సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్‌, సెక్టోరియల్‌ అధికారి శ్రీనివాస్‌, ఎంఈఓ గోపాల్‌నాయక్‌, ఆయా పాఠశాలల కాంప్లెక్స్‌ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



ఊట్కూర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఊట్కూరు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపట్టిన గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి కోరారు. మండలం నిడుగుర్తిలో మంగళవారం ఉపాధి హామీ కూలీలతో కలిసి పోస్టర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, కార్పొరేట్‌ శక్తులకు కొమ్ము కాస్తోందన్నారు. కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.శంకర్‌, రవి, ఆంజనేయులు, వెంకట్‌ పాల్గొన్నారు.

కోస్గి: అన్నిరంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలకోసం ఈ నెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం సూచించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్‌, పంచాయతీ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆయా శాఖల అధికారులకు సమ్మెనోటీస్‌ అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేష్‌తోపాటు ఆయా కార్మిక సంఘాల స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్దూరు: సమ్మె, గ్రామీణ బంధుపై మంగళవారం కొత్తపల్లి మండలంలోని భూనీడ్‌లో సీపీఐఎంఎల్‌ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఐకేపీ, వీఓఎలను రెగ్యూలర్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. సీపీఐఎంఎల్‌ ఏరియా కార్యదర్శి నర్సింహులు, ప్రజాసంఘాల నాయకులు ఊశప్ప, కొండప్ప, కిష్టప్ప, అంజి పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర చట్టం చేయాలి

మక్తల్‌: కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు అన్నారు. మంగళవారం మక్తల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర తక్కువ అమ్మడంతో రూ.4 లక్షల కోట్ల మేర నష్టపోతున్నారన్నారు. ఈ నెల16న రైతులు పిలుపునిచ్చిన బంద్‌లో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎండీ సలీం, కిరణ్‌, భాస్కర్‌, రాజు, ఆంజనేయులు, వెంకటేశం, లోకేష్‌, లక్ష్మణ్‌, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు విటమిన్‌-ఏ ద్రావణం పంపిణీ



మంతన్‌గోడ్‌లో చిన్నారులకు విటమిన్‌-ఏ ద్రావణాన్ని అందిస్తున్న సిబ్బంది



ఊట్కూర్‌లో..

మక్తల్‌: తొమ్మిది నెలల నుంచి ఐదుసంవత్సరాల లోపు గల చిన్నారులకు విటమిన్‌-ఏ ద్రావణాన్ని అందిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారిణి సమీనా అన్నారు. పట్టణంలోని మంతన్‌గోడ్‌లో అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న చిన్నారులకు మంగళవారం విటమిన్‌ ఏ ద్రావణాన్ని అందించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ చిన్నారులకు వీటిని అందించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి సమీనా, ఏఎన్‌ఎం వెంకటేశ్వరమ్మ, ఆశావర్కర్లు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రంలో మంగళవారం ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో వైద్యసిబ్బంది చిన్నారులకు విటమిన్‌ ఏ ద్రావణం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం గోవిందమ్మ మాట్లాడుతూ.. 9 నెలల వయస్సు నుంచి 5సంవత్సరాల పిల్లలందరికీ ఏ విటమిన్‌ ద్రావణాన్ని తాగిస్తున్నామని, దీంతో కంటి చూపు మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిరణ్‌కుమార్‌, మాజీ సర్పంచ్‌ కతలప్ప, ఆశావర్కర్లు ప్రియాంక, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తాడు లాగు పోటీలు



మక్తల్‌: జాతీయ మహిళ దినోత్సవం, సరోజినీనాయుడు జయంతిని పురస్కరించుకొని మంగళవారం మక్తల్‌లో జిల్లా టగ్‌ఆఫ్‌ వార్‌ ఆధ్వర్యంలో తాడు లాగు పోటీలను ఎస్‌ఐ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్తల్‌ నుంచి క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. క్రీడాకారులకు విశ్రాంత పీఈటీ గోపాలం తనవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్‌, కార్యదర్శి గోపాలం, శ్రీనివాసులు, అంబ్రేష్‌, రమేష్‌, జాంగీర్‌, పునీత్‌ తదితరులు పాల్గొన్నారు.

రూ. 20వేలు వితరణ

మండలంలోని రుద్రసముద్రంలో శివలింగ ప్రతిష్టాపన సందర్భంగా గ్రామానికి చెందిన రాంలింగం రూ. 20 వేలు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం ఆయనను గ్రామస్తులు అభినందించారు. గ్రామస్తులు కుర్మయ్య, గోకరి రాము, జంగం నవీన్‌, శేఖర్‌, లింగమ్మ, నర్సింహ, రాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



సరేందర్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ వెంకటయ్య

మాగనూర్‌: మక్తల్‌ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు సరేందర్‌ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. కృష్ణా మండలంలోని కున్సీ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సరేందర్‌ జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకున్నారని, ప్రస్తుతం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికవ్వడం చాలా సంతోషంగా ఉందని మండల ఇన్‌చార్జి విద్యాధికారి వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో పూలమాలతో సన్మానించారు. ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



తిర్మలాపూర్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్‌: మండలంలోని తిర్మలాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. హెచ్‌ఎంగా అనురాధ, కలెక్టర్‌గా మహేశ్వరీ, డీఈఓగా శిరీష, ఎంఈఓగా అనిల్‌లు ఉపాధ్యాయులుగా తోటివిద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం చక్కటి బోధన చేసిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మొల్గాన్‌జనార్దన్‌, ఉపాధ్యాయులు అర్చన, చంద్రశేఖర్‌, పద్మ, కర్ణ, వినయ్‌, ఉషశ్రీ, నవీన్‌, ప్రియాంక పాల్గొన్నారు.

కోస్గి: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ మేరకుక.. బోధనలో ప్రతిభ కనబర్చిన వారికి పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంతోపాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మాగనూర్‌: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ మేరకు.. పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు మాట్లాడుతూ.. ఉన్నత విలువలను చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

కోస్గి(మద్దూరు): కొత్తపల్లి మండలంలోని నిడ్జింత, భూనీడ్‌ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యారులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా కుర్మమ్మ, కలెక్టర్‌గా శ్రీలత, ఎంఈఓగా త్రివేణి, ఆర్‌జేడీగా శ్రావణి, విద్యాశాఖ మంత్రిగా వీరేష్‌, వీరితోపాటు మరో 50మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఆంజనేయులు, లింబ్యానాయక్‌, ఉపాధ్యాయులు రఘు, లాజర్‌, సుజాత, విజయ్‌, దేవేంద్రప్ప, భీంసెన్‌, యదమ్మ, అనంతజేన, అనురాధ, లత పాల్గొన్నారు.



కోస్గిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



నిడ్జింతలో ..

నేటి నుంచి వెంకన్న ఉత్సవాలు



గట్టుతిమ్మప్ప స్వామి

మక్తల్‌: నియోజకవర్గంలోని మాద్వార్‌, నల్లకొండలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి (గట్టు తిమ్మప్ప) మూడో పేదల తిరుపతిగా ఈ ప్రాంత భక్తులు బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరవుతున్నారు. మండలంలోని మాద్వార్‌లో స్వామివారి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు, మాజీ మార్కెట్‌ డైరెక్టర్‌ రాజేశ్వర్‌రావు తెలిపారు. 14న ఉదయం 9గంటలకు స్వామివారిని పల్లకీసేవతో పవిత్రమైన కృష్ణానది పుష్కర నీటిని తీసుకొచ్చి స్నానం చేయిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 15న సాయంత్రం ప్రభోత్సవం, 16న రథసప్తమి ఉదయం 11గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 6గంటలకు స్వామివారి రథోత్సవం 17న శనివారం పాల ఉట్ల కార్యక్రమం, 18న ఉదయం 10 గంటలకు శివస్వాములు మహాపూజ కార్యక్రమం, సాయంత్రం 6గంటలకు గరుడ వాహన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని వారు తెలిపారు. నేటి నుంచి ప్రారంభమయ్యే స్వామివారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు రాజేశ్వర్‌రావు తెలిపారు.

నల్లగొండకు తరలిన నాయకులు



మాగనూర్‌లో సభకు వెళ్తున్న నాయకులు

నర్వ: బీఆర్‌ఎస్‌ నిర్వహిస్తున్న బహిరంగ సభకు మండలం నుంచి భారీగా బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు మంగళవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నల్లగొండ సభకు ప్రత్యేక బస్సును బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలం నుంచి తరలివెళ్లిన వారిలో బీఆర్‌ఎస్‌ నాయకులు సింగిల్‌విండో చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ లక్ష్మన్న, నాయకులు చిన్నయ్య, దండు అయ్యప్ప, గడ్డం నర్సింహులు, ఎంపీటీసీ శ్యాంలాల్‌, డా.శంకర్‌, కల్వాల్‌ ఆంజనేయులు, నాగరాజు ఉన్నారు.

మాగనూర్‌: బీఆర్‌ఎస్‌ నిర్వహిస్తున్న బహిరంగ సభకు మండలం నుంచి భారీగా బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు మంగళవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండలం నుంచి తరలివెళ్లిన వారిలో బీఆర్‌ఎస్‌ నాయకులు సింగిల్‌విండో చైర్మన్‌ వెంకట్‌రెడ్డి, నాయకులు మల్‌రెడ్డి, నర్సింహులు, రవి, అశోక్‌గౌడ్‌, వెంకటయ్య, గోపాల్‌, కేశవరెడ్డి ఉన్నారు.

మరికల్‌: నల్గొండలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ తలపెట్టిన బహిరంగ సభకు మంగళవారం మండలం నుంచి బస్సుల్లో నాయకులు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే ఎస్‌. రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లినట్లు మండల అధ్యక్షుడు తిరుపతయ్య తెలిపారు.